# నివాళి

సాయంకాలం నాలుగు గంటలవుతోంది. శీతాకాలం ఎండ ఏటవాలుగా పడుతోంది. తారురోడ్డుకి వంద గజాల దూరంలో, రాళ్ళ గుట్టల మధ్య కొంచెం చదునైన ప్రదేశంలో ఓ మూల ఎర్ర జండా ఎగురుతోంది. ఆ ఎర్రజెండా నీడన ఒకతను డప్పు వాయిస్తూ పాటపాడుతున్నాడు. అతని నడుంకి చిన్న ఎర్రగుడ్డ, కాళ్ళకి గజ్జెలు - భుజం మీద నల్ల కంబళి ఒకటి వేసుకున్నాడు. అతని పక్కన పదిహేడేళ్ళ కుర్రాడు ఒకడు చేతి కర్ర నేలను తాటిస్తూ వంత పాడుతున్నాడు. మరో నలుగురు కుర్రాళ్ళు పక్క వాద్యాలు వాయిస్తూ అప్పుడప్పుడు అందిస్తున్నారు. అతని చుట్టూరా రాళ్ళ మీద ఓ వంద మంది కూలి జనం కూర్చుని అతని పాట వింటున్నారు.

' తెల్లోడు పోయెనంట - నల్లోడు వచ్చెనంట
ఎవ్వనిదీ రాజ్జెమొచ్చినా - ఓ రాజయో
ఏడ్చి సచ్చే రోజులాయెరో....'

ఆ సమయంలో తారు రోడ్డు మీద ఎంబాసిడర్ కారు ఒకటి హైదరాబాద్ వేపు పోతోంది. అందులో వెనుక సీటులో కూర్చున్న వ్యక్తి .సి.సి.బి. టీవి విలేఖరి రిచర్డ్‌ను రాళ్ళ గుట్టల మధ్య ఎగురుతున్న ఎర్రజండా ఆకర్షించింది. అతను సి.సి.బి. టీవికి ఇండియా మీద డాక్యుమెంటరీ తీసే నిమిత్తం రెండు నెలలుగా భారత దేశమంతా పర్యటిస్తున్నాడు. కారులో అతనితో పాటు అతని కెమేరామేన్ టామ్, ఆంధ్రదేశంలో సహాయ పడటానికి వెంటవచ్చిన శ్రీనివాసరావు ఉన్నారు.

రిచర్డ్ కారు ఆపమన్నట్లు చెయ్యెత్తాడు. కారు, మెల్లగా వేగం తగ్గి రోడ్డు మీద చింత చెట్టు నీడన ఆగింది. అతను కారు దిగకుండానే రావుకేసి తిరిగి, 'ఎవరతను?'

అనడిగాడు పాడుతున్న వ్యక్తికేసి చూపిస్తూ.

'అతని అసలు పేరు నాకు తెలియదు కాని అంతా అతన్ని డప్పులయ్య అంటారు. Famous Folk Singer with extremist leanings - కమ్యూనిస్టుల్లో అతివాదులు, తుపాకీ ద్వారా విప్లవం తీసుకొస్తామంటారు. అక్కడక్కడ తెలంగాణాలో, అడవి ప్రాంతాలలో వీళ్ళకు కొద్దిగా పలుకుబడి ఉంది', అని వివరించాడు రావు.

కారు దిగకుండానే మెళ్ళో వేళ్ళాడుతున్న బైనాక్యులర్స్ పైకెత్తి అటువేపు చూశాడు రిచర్డ్. గాలి వాలుకి డప్పులయ్య పాట కెరటాలు, కెరటాలుగా వస్తోంది.

'.... పచ్చా పచ్చని బూమి, పచ్చాని బూమి - అమ్మలాలో
పైడిపంటల బూమి - బంగారు బూమి - అమ్మలాలో
క్రిష్ణమ్మ కరుణిస్తే - రతనాలే పండు - అమ్మలాలో
గోదారి కరుణిస్తే - వజ్రాలే రాలు- అమ్మలాలో
పచ్చా పచ్చని బూమి - పచ్చాని బూమి - అమ్మలాలో....'.

కన్నతల్లి లాంటి చల్లని ఊరు - పంట పొలాల్లో వంపులు తిరుగుతూ ప్రవహించే కాలువ - బంగారం పండిన చేలు - వెండి పూలు చల్లిన పత్తిపొలాలు - వెన్నెల్లో మిలమిలమెరుస్తున్న కొబ్బరాకులూ - కళ్ళాపి చల్లిన వాకిట్లో విరబూసిన బంతిపూలు - గుడిసె మీదకి పాకిన ఆనపపాదు ఆకుల మాటు నుంచి తొంగి చూస్తున్న ఆనప పిందెలు - లేగదూడలా ఛంగున గంతులు వేస్తూ తిరిగిన పసితనం - కూలిన కొంపలు - కూలి బ్రతుకులు - కూటికి అగచాట్లు...... ఆపాట వింటుంటే ఏయే దృశ్యాలు కళ్ళ ముందు మెదిలాయో, శ్రోతల గుండెలు బరువెక్కాయి. ఆడకూలీలు కొంగుతో కళ్ళు తుడుచుకుని బిడ్డల్ని దగ్గరకు తీసుకున్నారు.

బైనాక్యులర్లోంచి వాళ్ళని చూస్తున్న రిచర్డ్‌కి పాట అర్థం కాకపోయినా శ్రోతల మొహాల్లో కదలాడే భావాలు స్పష్టంగా కనుపించి, 'అతను ఏం పాడుతున్నాడు', అనడిగాడు ఆశ్చర్యంగా. రావు అనువదించి చెప్పాడు.

**'He seams to be quite interesting** - పద, అతనితో మాట్లాడుదాం' అన్నాడు రిచర్డ్ కారు దిగి దారి తీస్తూ.

వాళ్ళు వస్తుంటే జనం వింతగా చూస్తూ దారి ఇచ్చారు. పరిచయాలైన తర్వాత రిచర్డ్ కెమెరా ముందు నిలబడి అడిగాడు - 'సి.సి.బి పేరు విన్నావా?'

డప్పులయ్య సమాధానాలు చెప్పసాగాడు. అతను సి.సి.బి టీవీ గురించీ, స్టార్ టీవీ గురించి విన్నాడు కానీ చూడలేదు. ఇంగ్లీషు అర్థం కాదు, తెలుగు రాయడం చదవడం వచ్చు కాని ఎక్కువగా చదువుకోలేదు. అతని చదువంతా ఉద్యమాల ద్వారానే.

'మీరెందుకు పోరాడుతున్నారు?'

'కమ్యూనిజం కోసం'

'కమ్యూనిజం అంటే?'

'సోషలిజం'

'సోషలిజం అంటే?'

'అంతా సమానంగా ఉండాలని.... ' - సంభాషణలో కలుగ చేసుకుంటూ అన్నాడు డప్పులయ్య పక్కనున్న కుర్రాడు శివ.

'అంతా సమానంగా ఎప్పుడూ లేరనీ, ఎప్పుడూ ఉండరనీ నేనంటాను. ఒక కూలీకి, ఒక ఇంజనీరుకి సమాన వేతనం ఇస్తే ఇంజినీరవడానికి ఎవడైనా ఇష్టంగా కష్టపడతాడా?'

శివ కొంచెం తడబడ్డాడు. పదిమందీ అంటుండగా వింటున్నదే కాని నిజానికి సోషలిజం అంటే ఏమిటో ఆది ఎలా వస్తుందో అతనికి అవగాహనలేదు.

శివ మౌనం చూసి డప్పులయ్య సమాధానం చెప్పాడు-'అందరూ సమానమంటే అందరికీ సమానావకాశాలుండాలని.... అందరికీ కూడూ, గుడ్డా, నీడా ఉండాలని...'

'అది కూడా అందమైన కలే అంటాను.'

'అది కలే అయితే ఆ కలకోసమే మేం పోరాడుతాం. మనిషి మనిషిలా బతకాలనుకోవడం అందమైన కల అనిపించే అమానుష వ్యవస్థని మేం పునాదులతో సహా తవ్వి పారేసి పేదల రాజ్యం తీసుకొస్తాం..'.

'సోషలిజం , సమానత్వం, పేదల రాజ్యం. ఇవన్నీ అందమైన భ్రమలు. పేదల రాజ్యంలో కూడా రాజులు వేరే ఉంటారనీ , వారూ పేదల ఒకటి కారనీ చరిత్ర రుజువు చేసింది. ఈ నినాదాల మీద లేచిన సోషలిస్టు రాజ్యాలు ఒకదాని తర్వాత ఒకటి పేకమేడల్లా ఎలా కూలిపోయాయో చూశావా?'

'సోషలిజం అనేది అసలు ఉంటేగా కూలిపోవడానికి' డప్పులయ్య అన్నాడు,- 'సోషలిజం స్థాపనకు అనేక దేశాల్లో ప్రయత్నాలు జరిగాయి. అనేక కారణాల వలన ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అంత మాత్రాన సోషలిజం ఓడిపోయిందని నేననుకోను. చరిత్ర సూటిగా పురోగమించదు. పురోగమనం, తిరోగమనం, మళ్ళీ పురోగమనం- ఇది చరిత్ర నడిచే పద్ధతి అని మాకు తెలుసు.'

'ఇప్పుడు ఏ దశలో ఉన్నారు మీరు?' రిచర్డ్ నవ్వుతూ అడిగాడు.

'నా ఉద్దేశంలో ఈ శతాబ్దంలో సోషలిస్టు పోరాటానికి మూడు ప్రధాన దశలు కనిపిస్తున్నాయి. రష్యా విప్లవం నుంచి స్టాలిన్ మరణం వరకూ సోషలిజం పురోగమనం, స్టాలిన్ మరణం నుంచి సోవియట్ యూనియన్ పతనం వరకూ తిరోగమనం, ఇప్పుడు సోషలిస్టు శక్తులు సంఘటిత పడి మళ్ళీ పురోగమించాల్సిన కాలం....'

'ఇప్పుడా?' రిచర్డ్ ఆశ్చర్యపోతూ అన్నాడు- 'దేశం తర్వాత దేశం సోషలిజానికి ఎలా గుడ్‌బై చెప్పేస్తున్నాయో, నిన్నటి కమ్యూనిస్టు పార్టీలు పేర్లు, జెండాలు ఎలా మార్చే స్తున్నాయో గమనించావా? చైనాలో కూడా ఎర్రజండా నియంతృత్వంలో నీవు కలలుగంటున్న సోషలిజం కాకుండా కేపిటలిజం నిర్మాణం జరుగుతోందని తెలుసా? కేపిటలిజం ప్రపంచమంతా విస్తరించి బలపడుతుంటే ఇది సోషలిజానికి

అనుకూలమైన కాలం అనడం ఆశ్చర్యంగా ఉంది.'

'ఊడలు దించి విస్తరించిన మహా వృక్షం నిన్నటిది. దాని నీడన మొలకెత్తే విత్తనం రేపటిది. ఎంత ధృఢంగా కనుపించినప్పటికీ కాలంతో పాటు వంగి పోవాల్సింది ఒకటి. ఎంత బలహీనంగా ఉన్నప్పటికీ ఎదిగే దశలో ఉన్నది మరొకటి. వడగాలులకీ, తుఫానులకీ మహావృక్షం తట్టుకున్నట్టు తట్టుకోలేకపోయినా భవిష్యత్తు విత్తనానిదే. కాలం దాని వేపే ఉంటుంది. కొంతమంది విలాస జీవితానికి కోట్ల మందిని బలిచేసే వ్యవస్థ నిన్నటిది. అది కూలిపోక తప్పదు. రేపు నిశ్చయంగా మాదే....' అంటూ గేయం అందుకున్నాడు డప్పులయ్య.

'.....మేం తిరిగి వస్తాం
కొత్త రక్తంతో
కోట్లమంది మై!
మేం మళ్ళీ వస్తాం
కోటి కిరణాలతో
రేపటి ఉదయమై !'

రావు అనువదించి చెప్పాడు. రిచర్డ్ పగలబడి నవ్వి, డప్పులయ్య నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు లాక్కుని, కెమేరా కేసి తిరిగి **'Are you listening Mr.American President? You have not heard the last word yet on socialism. My young friend in Asia does not think that he is beaten. He says he will come back..** మీ బాంబులు, గన్నులు, టాంకులు, విమానాలు, రాకెట్లు, ఏవీ మిమ్మల్ని కాపాడలేవు. మా డప్పులయ్య డప్పు తీసుకుని రేపు నాదంటూ పాటలు పాడుతూ వస్తున్నాడు. కాసుకోండి' అన్నాడు, అమెరికా అధ్యక్షుల్ని వేళాకోళంగా హెచ్చరిస్తూ .

ఇంటర్వ్యూ పూర్తయింది. 'బెస్ట్ ఆఫ్ లక్' అంటూ చేతులు కలిపి రిచర్డ్ కారు వేపు నడిచాడు. రావు ఒళ్ళు విరుచుకుని, తలుపు తీసి కార్లో కూర్చున్నాడు. అప్పటికి పొద్దు వాలింది కాని ఇంకా బాగా వెలుగుంది.

'టామ్! రాళ్ళూ రప్పలూ, గడ్డి పరకలేని ఈ భూమి, ఈ దారిద్ర్యం - అంతా ఫ్రేం లోకి వచ్చేలా చూడు. ఎడిటింగ్‌లో ఏం చెయ్యాలో చూద్దాం' అన్నాడు రిచర్డ్ కారు దగ్గర నిలబడి. టామ్ వేరు వేరు కోణాల నుంచి డప్పులయ్య దళాన్ని దూరం నుంచి చిత్రీకరి స్తుంటే, రిచర్డ్ కారునానుకుని నిలబడి జేబులోంచి సిగరెట్ పేకెట్ తీసి, సిగరెట్టు వెలి గించి, డప్పులయ్య కేసి చూస్తూ ఆలోచించసాగాడు.

అతను డప్పులయ్య లాంటివాళ్ళను ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో అనేక దేశాల్లో కలిశాడు. వాళ్ళ రంగు, భాష, జెండా, రాజకీయాలు, నినాదాలు వేరు కావచ్చు. కాని సారాంశం ఒక్కటే - ఆకలి, అశాంతి.

అతను రెండు నెలలుగా భారత దేశమంతా పర్యటిస్తూ జర్నలిస్టు కళ్ళతో

దేశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాడు. నగరాల్లో, పల్లె ప్రాంతాల్లో తిరుగుతూ దేశంలోని ఘోరమైన దారిద్ర్య స్వరూపాన్ని అర్థం చేసుకున్నాడు. తల్లి కొంగు వదలలేని వయసులో రోజుకు పది, పన్నెండు గంటలు గొడ్డల్లా పనిచేస్తూ పసితనం అంటే ఏమిటో మరచిపోయిన లక్ష లాది పసివాళ్ళను చూశాడు. చిన్నచిన్న పరిశ్రమల్లో, కార్ఖానాల్లో పనిగంటల నియమం, భద్రతా, కనీస కూలి లేకుండా దారుణంగా దోచుకోబడుతున్న కోట్లాది కార్మికుల జీవితాలు చూశాడు. రైలు స్టేషన్లలో, పుణ్య స్థలాల్లో - దేశంలో ఏ మూలకు పోయినా పిడికెడు మెతుకుల కోసం ఈగల్లా ముసిరే బిచ్చగాళ్ళను చూశాడు. మరోపక్క, **'Indians are entitled to good things of life.'** అంటూ కొంతమంది, ఇండియన్స్ అంటే తామే అన్న భావం నిస్సంకోచంగా వెల్లడిస్తూ, పశ్చిమ దేశాల జీవన ప్రమాణాలను అందుకోవడానికి, అనుకరించడానికి ఆరాటపడటం చూశాడు.

ఈ అసమానతల పరిణామం ఎల్లా ఉంటుందోకూడా అతను దేశ దేశాల్లో గమనిస్తున్నాడు. బ్రెజిల్లో పట్టుమని పదేళ్లు నిండని అనాథలైన పిల్లలు గేంగులుగా తిరుగుతూ, దోపిడీలు, హత్యలూ చెయ్యడం, పోలీసులు రోడ్ల మీద నిద్రపోయే ఈ బాలనేరస్థుల్ని నిద్రలోనే మరతుపాకులతో కాల్చి చంపడం చూశాడు. మెక్సికోలో బిలియనైర్ల విలాసజీవితంతో పాటు మాయా ఇండియన్ల తిరుగుబాటూ చూశాడు.

అక్కడే కాదు, ఋణగ్రస్తమవుతున్న మూడవ ప్రపంచంలో, రష్యాలో, తూర్పు యూరోపు దేశాల్లో విచ్ఛిన్నమవుతున్న సామాజిక వ్యవస్థను, ప్రబలుతున్న అరాచకాన్నీ చూశాడు. ప్రపంచాన్ని చుట్టుముట్టుతున్న అశాంతిలో భాగంగానే ఇక్కడ డప్పులయ్యనీ చూస్తున్నాడు అతను.

'సమాజాంతరాళాల్లోంచి నేడు చెదురుమదురుగా, బలహీనంగా వినవస్తున్న ఈ రణగొణ ధ్వనులు రాబోయే విస్ఫోటాలకు సంకేతాలా? లోలోన రగులుతున్న ఈ అగ్ని పర్వతాలు బ్రద్దలైన రోజున ఈ ప్రపంచం ఎలా మారుతుంది?' - రిచర్డ్ అసహనంగా కదిలి సిగరెట్టు పీక విసిరేసి, మరో సిగరెట్టు అంటించాడు.

పరిచితమైన ప్రపంచం కూలిపోయి, దాని స్థానంలో అపరిచితమైన ప్రపంచం తలెత్తుతోందనీ, ఆకలీ, కన్నీళ్ళూ అర్థంకాని, హృదయం లేని ఆర్థిక వ్యవస్థ ప్రపంచాన్ని చుట్టబెట్టుతోందనీ రిచర్డ్ గమనిస్తున్నాడు . తుమ్మెద మధువు కోసం పువ్వు నుంచి పువ్వుకి ఎగిరినట్లు పెట్టుబడి లాభాల కోసం ప్రపంచమంతా తిరుగుతోంది. స్వేచ్ఛా విపణి పేరుతో బలహీన దేశాల స్వేచ్ఛా స్వాతంత్రాలను క్రమ క్రమంగా హరిస్తోంది. క్రిందటి శతాబ్దాలలో ఇటువంటి పరిస్థితి వలస విధానానికి, వ్యాపార యుద్ధాలకి, ప్రపంచ యుద్ధా లకు, రక్తపాత విప్లవాలకు దారితీసింది. ఇప్పుడేమవుతుంది? అనూహ్యమైన వేగంతో వస్తున్న ఈ మార్పు దేశాలన్నింటినీ శాంతి యుతంగా వసుధైక కుటుంబంగా ఏకం చేస్తుందా? లేక ఇదివరకు లాగానే ఇప్పుడు కూడా మారణ హోమంలో కోట్ల మందిని బలితీసుకుంటుందా?.....

రిచర్డ్ అలా ఆలోచిస్తుండగా, రాళ్ళ గుట్ట వెనుక నుంచి ఒక జీపు వేగంగా వచ్చి ఆగింది. అందులోంచి అయిదారుగురు వ్యక్తులు బల్లాలు , కత్తులు, గొడ్డళ్ళు

తీసుకుని దూకి డప్పులయ్య వేపు పరుగెట్టారు. వాళ్ళు వస్తూనే డప్పులయ్య తల మీద గొడ్డలితో ఒక్కటి వేశారు. 'శివా' అని పెద్దగా కేకపెట్టి రెండు చేతులతోనూ తల పట్టుకుని ఒరిగి పోయాడు డప్పులయ్య. గూండాలు కంటబడగానే అసంకల్పితంగా పారిపోయిన శివకి అప్పుడు తెలివొచ్చి, 'అన్నా' అంటూ వెనక్కు తిరిగి అతని రక్షణకు రాబోయాడు. రౌడీలు అతన్ని ఓ పక్కకు విసిరేసి, పడిపోతున్న డప్పులయ్యను పది పన్నెండు సార్లు కత్తులతో, బల్లాలతో పొడిచారు. వాళ్ళు అతన్ని హత్య చేసి జీపువైపుకి పరిగెడుతుంటే, రోడ్డు మీద ఎంబాసిడర్ కారు, కారుపక్కన టీవీ కెమేరా కనుపించాయి. వాళ్ళు ఒక క్షణం తెల్లబోయి, ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుని, గొడ్డళ్ళు ఊపుతూ రోడ్డు మీదకు పరిగెట్టుకొచ్చారు. కెమేరా మేన్ ని కారులోకి గెంటి, తలుపేసి అక్కడే కదలకుండా నిలబడ్డాడు రిచర్డ్.

అతను ఆరడుగుల ఆజానుబాహుడు. నిర్భయంగా నిలబడ్డ అతన్ని చూసి, వాళ్ళు ఏం చెయ్యాలో తెలియక ఆగిపోయారు. తెల్లవాడంటే ఇంకా కొద్దిగా ఉన్న బెదురో, లేకపోతే తెల్లవాణ్ణి చంపితే గొడవ అవుతుందనో, వాళ్ళు సాహసించలేదు.

'హు ఆర్ యు?'- అందరి కంటే ముందున్న వ్యక్తి అడిగాడు. అతని మొహం ఒత్తు మీసాలతో భయంకరంగా ఉంది. కళ్ళు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. అతను తాగి ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. అతని పక్కన ఖద్దరు పంచె, లాల్చీ తో మరో వ్యక్తి ఉన్నాడు.

'నాపేరు రిచర్డ్. సి.సి.బి. టీవి కరస్పాండెంటుని' అన్నాడు రిచర్డ్ మెల్లగా, స్పష్టంగా ఒత్తి పలుకుతూ.

రిచర్డ్ సి.సి.బి విలేఖరి అనగానే మీసాల వాడు తటపటాయించాడు. పక్కనున్న వ్యక్తి కేసి చూశాడు ఏం చేద్దాం అన్నట్లు. అతనితో మెల్లగా మాట్లాడాడు. రిచర్డ్ ఇదంతా కెమేరాలో రికార్డు చేసి ఉంటాడని అనుమానం వచ్చింది ఇద్దరికీ.

'ఆ కేసెట్ .... ఇచ్చేయ్....' అన్నాడు మీసాల వాడు.

రిచర్డ్ కారు తలుపు తీసి, 'టామ్! కేసెట్ ఇచ్చెయి...' అన్నాడు. టామ్ కారు దిగి, కెమెరాలోంచి కేసెట్ తీసి ఇచ్చాడు. కేసెట్ తీసుకుని 'నౌ...గో' అన్నాడు మీసాలవాడు బెదిరిస్తున్నట్లు.

'ఓ..కే,' అన్నాడు రిచర్డ్ భుజాలు ఎగరేసి. అతనికీ, టామ్‌కీ అలాంటి అనుభవాలు కొత్త కావు. అతను కూర్చున్నాకా కారు కదిలింది. కొంత దూరం వెళ్ళాకా, 'కేసెట్ సేఫ్‌గా ఉందా?' అనడిగాడు రిచర్డ్.

'ఉంది. వాళ్లు నిన్ను బెదిరిస్తున్నప్పుడు స్టిల్ కెమేరాతో ఫొటోలు తీశాను. అవి కూడా బాగా రావచ్చు,' అన్నాడు టామ్.

వారం రోజుల తర్వాత ఓ ఉదయం వామపక్షాలకు చెందిన శాసన సభ్యులొకరు, ప్రశ్నోత్తరాల సమయం తర్వాత కాల్ అటెన్షన్ మోషన్ రూపంలో డప్పులయ్య హత్యా ఉదంతం శాసన సభలో ప్రస్తావించి, ఇందులో స్థానిక పోలీసు ఆఫీసరుకు, అధికార పక్షానికి చెందిన స్థానిక శాసన సభ్యులకు ఏమైనా ప్రమేయం ఉందా అని ప్రశ్నించారు. దానికి ఆంతరంగిక వ్యవహారాల మంత్రి తీవ్ర అభ్యంతరం

తెలిపారు. వాదోపవాదాలు జరిగాయి.

ముఖ్యమంత్రిగారు కలుగ చేసుకుని, గౌరవనీయుడైన తన మిత్రుడు నిరాధారమైన ఆరోపణలు చెయ్యడం తనకు చాలా విచారం కలిగిస్తోందన్నారు. అధికార పక్షం మీద అభాండాలు వేయడం రాజకీయ చతురత అనిపించు కుంటుందేమో కానీ విజ్ఞత అనిపించుకోదన్నారు. ఈ హత్య ఉదంతం విచారించడానికి ప్రభుత్వం ఏకసభ్య సంఘాన్ని నియమిస్తోందని కూడా తెలియ చేశారు.

మూడు నెలల్లో ఏకసభ్యసంఘ నివేదిక వచ్చింది. అతివాద రాజకీయాలతో విసుగు చెందిన స్థానిక ప్రజలు తమ ఆగ్రహాన్ని దురదృష్టవశాత్తూ హింసాయుతంగా తెలియ చేశారని నివేదిక పేర్కొంది. గౌరవనీయులైన ముఖ్యమంత్రి, నివేదికను గౌరవనీయ మైన సభకు సమర్పిస్తూ, జరిగిన దానికి చింతిస్తున్నా ఒక విషయం సభ దృష్టికి తీసుకు రాదలిచానంటూ, 'తుపాకి పట్టినవాడు తుపాకితోనేమరణిస్తాడన్న' సామెత సభ్యులకు గుర్తు చేశారు. ప్రతి పక్ష సభ్యులొకరు, ఈ సామెత నిరంతరం తుపాకుల రక్షణలో మసిలే మీకు కూడా వర్తిస్తుంది కదా! అని చమత్కరించారు. అంతా గొల్లున నవ్వారు. చమ త్కార సంభాషణలతో, నవ్వుల మధ్య డప్పులయ్య హత్య ఉదంతం అలా ముగిసి పోయింది.

అలా ముగిసిపోయేదేకానీ.... మరి నాలుగు నెలల తర్వాత ఇంగ్లండులో ఫెస్టివల్ ఆఫ్ ఇండియా పెద్ద ఎత్తున నిర్వహించబడింది. ఆ ఉత్సవానికి భారత దేశం నలుమూలల నుంచి రెండు వందల మందికి పైగా కళాకారులు తరలి వెళ్ళారు. భారతీయ సంస్కృతి, జానపద కళలు, నృత్యాలు, సంగీతం గురించి పెద్ద ఎత్తున ప్రచారం ఇవ్వబడింది. భారత ఉపరాష్ట్రపతి ఉత్సవాన్ని మరునాడు ఆవిష్కరిస్తారనగా ఆ రోజు రాత్రి సిసిబి టీవీలో భారత దేశం మీద రిచర్డ్ డాక్యుమెంటరీ ప్రసారం చెయ్యబడింది. అందులో డప్పులయ్య హత్య ప్రేక్షకులందర్నీ విస్మయంలో ముంచెత్తింది. ఆవిష్కరణోత్సవానికి ఆహ్వానించబడిన ప్రముఖ ఇంగ్లీషు కళాకారులు ఉత్సవాన్ని బహిష్కరించడమే కాకుండా నల్లబేడ్జీలు ధరించి, నల్లజండాలతో మౌనంగా నిరసన ప్రదర్శన చేశారు. అంతర్జాతీయంగా గగ్గోలు రేగింది. భారత ప్రభుత్వానికి అది ఇబ్బందికరంగా పరిణమించింది. లండన్ లోని ఇండియన్ హైకమీషన్-ఢిల్లీ -హైదరాబాద్‌ల మధ్య సంభాషణలు జరిగాయి, సందేశాలు నడిచాయి.

రెండు రోజుల తర్వాత ముఖ్యమంత్రిగారు హైదరాబాద్‌లో ప్రత్యేక పత్రికా సమావేశంలో ఆలస్యంగానైనా నిజం నిరూపించబడినందుకు సంతోషించి, నేరస్థులు ఎంత ఉన్నత స్థానంలోఉన్నా వారిని చట్టం శిక్షించి తీరుతుందని, వారు తప్పించుకోలేరని ఉద్ఘాటించారు. స్థానిక పోలీసు ఇన్‌స్పెక్టరు సస్పెండు చెయ్యబడ్డాడు. గౌరవనీయులైన స్థానిక శాసన సభ్యులు రాజీనామా చేసి, అరెస్టయి, వెంటనే బెయిలు మీద విడుదల య్యారు.

ముఖ్యమంత్రి తన సహాయనిధి నుంచి డప్పులయ్య కుటుంబానికి లక్ష

రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. అతని స్మారక చిహ్నంగా ఒక ఆడిటోరియం నిర్మాణానికి ప్రముఖ కళాకారులతో ఒక కమిటి ఏర్పడింది. ఆలస్యంగా కళ్ళు తెరిచిన స్థానిక పత్రికలు తమ నోరు అరువిచ్చాయి. పత్రికలలో బాగా ప్రచారం వచ్చింది. నెల రోజుల్లోనే కోటి రూపాయలకు పైగా పోగు పడింది.

డప్పులయ్య మెమోరియల్ హాల్ త్వరలోనే తయారయింది. అధునాతన సౌకర్యాలన్నీ ఉన్న పూర్తి ఎయిర్ కండిషన్డ్ హాలు అది. దాని ప్రారంభోత్సవం పెద్ద ఎత్తున జరిగింది. పెప్సీ కంపెనీ వారు పూలతో తూర్పు వైపున పెప్సీ గేటు పెట్టారు. పోటీగా పశ్చిమం వైపున కోకాకోలా వారు కోక్ గేటు పెట్టారు.

ముఖ్యమంత్రి గారు ప్రాంగణంలో ఉన్న డప్పులయ్య కాంస్య విగ్రహానికి దండలు వేసి నమస్కరించారు. ప్రారంభోత్సవానికి డప్పులయ్య దళ మిత్రులను ఆహ్వానించారు. దళం వారికి అతిథి గృహంలో చక్కటి ఏర్పాట్లు చేశారు. వారి కోసం ఒక కారు ఇచ్చారు. వారికి సరియైన సౌకర్యాలు సకాలంలో అందేలా చూడడానికి ఒక ఉన్నతాధికారిని ప్రత్యేకంగా నియమించారు.

ఆరోజు సాంస్కృతిక ప్రదర్శనకు నగరంలోని ప్రముఖులూ, పేరు పొందిన కళా కారులూ వచ్చారు. పట్టుచీరెల రెపరెపలతో, రకరకాల సెంట్ల గుబాళింపులతో హాలంతా కళకళలాడింది.

శివదళం పాడింది, ఆడింది. కాని కాంక్రీటు పంజరంలో కోకిల పాట హాస్యా స్పదంగా ధ్వనించింది. వాళ్ళు బహిరంగ ప్రదేశంలో గొంతెత్తి పాడటానికి అలవాటు పడిన వాళ్ళు. చిటికేస్తే ఉరుము ఉరిమినట్లు వినిపించే అధునాతన సౌండ్ సిస్టమ్ లో వాళ్ళు అరుస్తూ, కేకలేస్తూ, గోలగా పాడితే, అంతా గందరగోళంగా తయారయింది. వాళ్ళ గజ్జెల చప్పుళ్ళు, డప్పుల మోతలూ వికృతంగా ప్రతిధ్వనించాయి. అజీర్ణమే తప్ప ఆకలి ఎరుగని శ్రోతలకు వాళ్ళ ఆకలి పాటలు విసుగు, చికాకు, ఒక్కోచోట జుగుప్స కలిగించాయి. అయినా ఆహ్వానితులు సభామర్యాద తెలిసినవారు. పైగా ముఖ్యమంత్రి ప్రదర్శన పూర్తయ్యేవరకూ లీనమై చూస్తూ కదలలేదు. ఆహ్వానితు లందరూ కూడా చిరునవ్వుతో, మొహాలలో భావం కనపడనీయకుండా చివరివరకూ ఉండి సభాకార్య క్రమం జయప్రదం చేశారు.

అంతా సవ్యంగా ముగిసింది. డప్పులయ్య మెమోరియల్ హాల్ ఇంక డియం హాల్‌గా ప్రసిద్ధికెక్కుతుంది. అక్కడ ఏడాది పొడుగునా సినీ తారలకు సన్మానాలు, జన్మదిన వేడుకలూ, పెళ్ళిళ్ళూ, సమావేశాలూ, సెమినార్లు, వర్కుషాపులు జరుగు తాయి. ఏడాదికోసారి డప్పులయ్య విగ్రహానికి తప్పకుండా ఒక దండ పడుతుంది.

అంతా సవ్యంగానే ముగిసింది.

అయినా శివకు ఎందుకో దిగులుగా ఉంది. ప్రదర్శన నవ్వుల పాలయిందని అతనికి అర్థమైంది. కాని దిగులు అందుకు కాదు. లక్షరూపాయలు ధన సహాయం

చేసి డప్పులయ్య కుటుంబం వీధుల్లో పడకుండా నిలబెడితే, అతని పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా అద్భుతమైన ఆడిటోరియం వెలిస్తే, దానికి సంతోషం కాక దిగులెందుకో అతనికి అర్థం కాలేదు. ఎవరో నేర్పుగా పన్నిన వలలో చిక్కుకు పోయి, వాళ్ళ చేతుల్లో కీలు బొమ్మలై, సిగ్గూ లజ్జా వదిలేసి, వాళ్ళ ఎదురుగా నగ్నంగా ఆడినట్లుగా ఉంది అతనికి .

తిరిగి వెడుతున్నప్పుడు రైల్లో కూడా అతను ఏమీ మాట్లాడలేదు. అతని మిత్రుల మనసుల్లో కూడా స్పష్టంగా ఇదీ అని వర్ణించలేని ఆవేదన నిండి ఉంది. ఎవరైనా సంభాషణ ప్రారంభించినా కొనసాగక ఆగిపోయి నిశ్శబ్దమవుతోంది.

వాళ్ళు దిగాల్సిన రైలు స్టేషను వచ్చింది. ఆ చిన్న స్టేషన్లో రైలు దిగి వాళ్ళు బయటకు వచ్చారు. అక్కడ స్టేషను మెట్ల మీద కూర్చున్న ముష్టిది ఆకలితో అల్లల్లాడుతున్న బిడ్డకు ప్లాస్టిక్ కప్పులోంచి అల్యూమినం చెంచాతో -నీళ్ళు- పట్టి స్తోంది. శివని చూసి ముష్టిది సందేహిస్తూ చేతులు చాపింది. అతను తన దగ్గరున్న రొట్టెముక్క, ఒక రూపాయి ఆమెకిచ్చాడు. ఆమె శివ పాదాలకు తల తాకిస్తూ ఏదో గొణిగింది.

మరో గంట తర్వాత గూడెం చేరేటప్పటికి చీకటి పడుతోంది. కాని ఇంకా వెలుగుంది. గూడెం ముందు ఈత చెట్ల దగ్గర పిల్లలు ఆడుతున్నారు. దూరంగా గుడిసెల మధ్య నుంచి ఓ ఆడదాని ఏడుపు భయంకరంగా వినిపిస్తోంది. మధ్య మధ్య మొగుడు కాబోలు, తిడుతున్న తిట్లు కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి. అక్కడంతా దుమ్ము, ధూళి, దరిద్రం, నిండివుంది.

శివ దళాన్ని గుర్తు పట్టిన పిల్లలు ఆటలు ఆపేసి వాళ్ళ చుట్టూ మూగారు. చింపిరి తలలు, చిరుగు గుడ్డలు, పోషణ లేక బక్క చిక్కిన శరీరాలు-వాళ్ళని చూస్తే శివకి తన బాల్యం గుర్తుకొచ్చింది. వాళ్ళు దరిద్రంలో పుట్టారు. దరిద్రంలో పెరుగుతున్నారు. చివరకు దరిద్రంలోనే రాలిపోతారు. ఈ రోజు కేరింతలు కొడుతూ ఆడుతున్న ఈ పసివాళ్ళ నవ్వు, ఆనందం, మరో పదేళ్ళలో మాయమైపోతాయి. ఎందుకు పుట్టారో , ఎందుకు బతు కుతున్నారో, ఎందుకు ఛస్తున్నారో తెలియ కుండానే దుమ్ములో కలిసిపోతారు. మరో విధమైన జీవితం ఉంటుందనీ, అందులో ఆశలూ, సంతోషాలు ఉంటాయనీ , అల్లాంటి జీవితం జీవించే హక్కు తమకీ ఉందనీ తెలియకుండానే వాళ్ళు రాలిపోతారు.

అక్కడికి, ఇక్కడికి ఎంత తేడా!

వెన్నెల వెదజల్లే విద్యుద్దీపాలు, వేసవి ఎరుగని ఏసీ గదులు, హోటళ్లు, క్లబ్బులు, కార్లు-ఒకచోట అంత ఐశ్వర్యం ఎలా పోగుపడుతోంది? ఇక్కడ ఇంత దరిద్రం ఎందు కుంది?

'లోకమంతా ఈ గొప్ప - బీదా అంతరం అనాదిగా ఉంటున్నదే అనీ! ఇదే లోకం తీరు అనీ! కూలిపోయిన కూలీల రాజ్యాలు చూపించి ఎగతాళి చెయ్యనీ!

నేను మాత్రం ఇది అసహజం అంటా. ఎవరు విన్నా వినకపోయినా - ఒంటరిగానైనా సరే - గుండెలు పగిలేలా గొంతెత్తి అరుస్తూ ఇది అన్యాయం అంటా! ఈ దుర్మార్గాన్ని నేను సహించను...' -శివకి ఆవేశంతో పాటు, ఏవీ చెయ్యలేని తన నిస్సహాయతకు ఉడుకుమోత్తనంతో కన్నీరు పొంగుకొచ్చింది. ఆ కన్నీటి తెరచాటున డప్పులయ్య రూపం అస్పష్టంగా కనిపించింది.

అతను కళ్ళు తుడుచుకుని, చేతి కర్ర నేలలో దింపి దానికి ఎర్రజండా తగిలించాడు. హరికేను లాంతరు వెలిగించి, చెట్టు కొమ్మకి వేలాడదీశాడు. ఎర్ర రుమాలు తీసి తలకు చుట్టుకుని డప్పు అందుకున్నాడు.

జజ్జణక.... జజ్జణక.... జజ్జణక... డప్పులయ్య డప్పు మళ్ళీ మోగసాగింది. పొయ్యిల ముందు వంట ప్రయత్నాలలో ఉన్న ఆడవాళ్ళు తలెత్తి చూశారు. బీడీలు కాలుస్తూ, కబుర్లు చెప్పుకుంటున్న మొగాళ్ళు బీడీలు ఆర్పి చెవుల్లో పెట్టి లేచారు. శివగొంతులో తమ బ్రతుకు పాట వినడానికి గూడెంలో చిన్నా పెద్దా, ఆడా మగా, అందరూ అతనిచుట్టూ మూగారు. ఆ సమయంలో దళవంతకీ డప్పులయ్యకు నిజమైన నివాళి ఏవిటో అర్థమైంది. వాళ్ళు పదం అందుకున్నారు....

'అయ్యోరయ్యో - రయ్యో
అప్పలకొండో - కొండో
రండో రండో - రండో ఽ
రండోహో - రండోహో'

జజ్జణక ... జజ్జణక...జజ్జణక... డప్పులయ్య డప్పు విరామం లేకుండా మోగుతూ అడవుల్లో , కొండల్లో, నగరాల్లో, . పల్లెల్లో, పొలాల్లో, కార్ఖానాలలో ప్రతిధ్వనిస్తూ అభాగ్యులైన అప్పల కొండల్ని పిలుస్తోంది. ఈ లోకం అందరిదీ అనీ, ఈ లోకంలో మనిషిగా బతికే హక్కు మాకూ ఉందని నిలదీసి అడగండని వెన్ను తట్టి లేపుతోంది.

**( సాహిత్య నేత్రం త్రైమాసిక పత్రిక 6, 7 సంచికలు- జూలై, సెప్టెంబరు 1996)**